క్లుప్తంగా

తప్పిపోయిన పాప తల్లిదండ్రులకు అప్పగింత



రామన్నపేట : వరంగల్ ఇస్లామియా గ్రౌండ్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో తప్పిపోయిన రెండేళ్ల చిన్నారిని బ్లూ కోట్స్ కానిస్టేబుల్ చిన్నారిని తల్లిదండ్రులకు వద్దకు చేర్చిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇస్లామియా గ్రౌండ్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో సఫా పర్వీన్ అనే రెండేళ్ల చిన్నారి తప్పిపోయి అహ్మద్‌కు దొరకగా అతను డయల్ 100 కాల్ చేసి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న బ్లూకోట్స్ కానిస్టేబుల్ కల్యాణ్‌కుమార్ కాల్ రిసీవ్ చేసుకొని హుటాహుటిన చిన్నారి వద్దకు చేరుకొని తల్లిదండ్రులైన షబానా సుల్తానా-అహ్మద్ బాషాకు అప్పగించారు. కానిస్టేబుల్‌ను పోలీస్ అధికారులు, చిన్నారి తల్లిదండ్రులు అభినందించారు.

ఐడీ కార్డుల అందజేత



దేశాయిపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వరంగల్‌కు చెందిన కమల సాంఘిక సేవా సంస్థ ఉచితంగా ఐడీ కార్డులను అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం కె.చక్రపాణి అన్నారు. సోమవారం పాఠశాలలో 300 మంది విద్యార్థులకు, 16 మంది ఉపాధ్యాయులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. సంస్థ జనరల్ సెక్రటరీ నిర్మల ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు తమ సంస్థ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేస్తున్నామని అన్నారు. దాతలు గంధం అజయ్‌కుమార్, హెప్సిభ, జీసీడీఓ కె.ఫ్లారెన్స్, థెరిస్సా రవళిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాకర్స్ శ్రమదానం

కాజీపేట: వడ్డేపల్లి రిజర్వాయర్ ట్యాంక్ బండ్‌పై సోమవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్ర నర్సింహారావు ఆధ్వర్యంలో సభ్యులు ట్యాంక్‌బండ్‌పై ఉన్న గార్డెన్‌లో మొలిచిన తుమ్మలతో పాటు పిచ్చిగడ్డిని తొలగించారు. ట్యాంక్‌బండ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా ఉండడానికి శ్రమదానం చేస్తున్నట్లు అధ్యక్షుడు తెలిపారు.

కానిస్టేబుల్ ఔదార్యం

హన్మకొండ చౌరస్తా : గ్రూప్-3 పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థి బైక్ సడెన్‌గా ఆగిపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న హనుమకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్ గంగాధరి రమేశ్ తన బైక్‌పై పరీక్ష కేంద్రం వద్ద దిగబెట్టాడు. కిషన్‌పురలోని ఆర్‌డీ కాలేజీలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థి బైక్ మర్కజీ సెంటర్‌కు రాగానే ఆగిపోయింది. ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గమనించాడు. తన బైక్ పై పరీక్ష కేంద్రం వద్ద ఒదిలిపెట్టాడు. కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

13వ డివిజన్ అధ్యక్షురాలిగా పూర్ణ



దేశాయిపేట: నగరంలోని 13వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కుమ్మరి పూర్ణను నియమిస్తూ సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న జారీ చేసిన ఉత్తర్వులను సోమవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేతుల మీదుగా అందుకుంది. తనకు అవకాశం కల్పించిన కొండా దంపతులు, నవీన్‌రాజు, ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా రమేశ్



మడికొండ: తెలంగాణ ముదిరాజ్ మహా సభ హనుమకొండ జిల్లా కార్యదర్శిగా 46వ డివిజన్ రాంపూర్ గ్రామానికి చెందిన పిట్టల రమేశ్‌ను నియమించినట్లు రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండా ప్రకాశ్ నియామక ఉత్తర్వులు సోమవారం జారీ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవిని అప్పగించిన బండా ప్రకాశ్‌కు, బయ్య స్వామికి, పులి రజనీకాంత్‌కు, దువ్వ నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హక్కుల సాధనకు పోరాడాలి

హసన్‌పర్తి : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడాలని సీపీఐ నాయకుడు నేదునూరి రాజమౌళి అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లాపురంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రాజమౌళి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బహుజనులకు న్యాయం జరగాలంటే సీపీఐలో చేరాలని పిలుపునిచ్చారు.

ఒక్కటైనం.. ఓట్లేసి గెలిపించినం

- ఇక అభివృద్ధిపై దృష్టి సారించండి
- సీఎం రేవంత్ రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లా మైనారిటీ సంఘాల విజ్ఞప్తి
- బీఆర్ఎస్ హయాంలో నిరాదరణకు గురయ్యామని ఆవేదన

న్యూశాయంపేట : ఒక్కటైనం.. ఓట్లేసి గెలిపించినం ..ఇక అభివృద్ధిపై దృష్టి సారించండి అని సీఎం రేవంత్ రెడ్డికి మైనారిటీ సంఘాల విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇటీవల అబుల్ కలాం జయంతి సందర్భంగా ఓ సభలో సీఎం రేవంత్‌రెడ్డి.. ముస్లింలు ఒక్కటై ఒక్క ఎమ్మెల్యే గెలిపించుకోలేదని, అందుకు ప్రభుత్వంలో మినిస్ట్రీలో మైనారిటీలకు ప్రాధాన్యం లేకుండా పోయిందంటూ ఉర్దూలో 'మై ముసల్‌మానోసే నారాజ్ హు' (నేను మైనారిటీల పట్ల అసంతృప్తితో ఉన్నా) అన్నారు. కానీ వరంగల్ ఉమ్మడి జిల్లా మైనారిటీ సమాజం ఒక్కటై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించామన్నారు. అయితే తమ అభివృద్ధిపై ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడం లేదని మైనారిటీ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా నేడు హనుమకొండలో జరిగే సభలోనైనా మైనారిటీలకు వరాలు ప్రకటించాలని సంఘాల నేతలు ముక్తకంఠంతో కోరుతున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మైనారిటీల అభివృద్ధి ఊసే లేకుండా పోయిందన్నారు. ప్రత్యేకంగా గ్రేటర్ వరంగల్ నగరంలో పలు పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిపై అధికారులతో చర్చించాలని కోరుతున్నారు.

ఉర్దూ ఘర్ కం షాదీఖానాలు..

2019లో అప్పటి సీఎం కేసీఆర్ నగర పర్యటన సందర్భంగా వరంగల్, హనుమకొండ నగరాలకు రూ. ఐదుకోట్ల చొప్పున షాదీఖానాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా వాటి ఊసే లేకుండా పోయింది. గత ఎన్నికల ముందు వరంగల్‌లో కొంత మేర పనులు ప్రారంభించి వదిలేశారు. హనుమకొండలో అప్పటి మంత్రి కేటీఆర్ షాదీఖానా కోసం హంటర్‌రోడ్ గుట్టల్లో 24 గుంటల స్థలం కేటాయించి హడావుడిగా శంకుస్థాపన చేసి వదిలేశారని మైనార్టీ సంఘాల నేతలు తెలిపారు.



వరంగల్ ఎల్‌బీ నగర్‌లో అసంపూర్తిగా ఉన్న ఉర్దూ ఘర్ కం షాదీఖానా

హజ్‌హౌజ్ కోసం..

మూడు సంవత్సరాల క్రితం అప్పటి మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటనలో భాగంగా వరంగల్ స్టేషన్ ఎదుట స్థలం కేటాయిస్తూ, రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా హజ్‌హౌజ్ నిర్మిస్తామని శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు దానిపై ఊసేలేకుండా పోయింది. అదేవిధంగా దేశాయిపేటలో మోడల్ మైనారిటీ గురుకులం, ఈద్గాలు, మసీదు, ఖబ్రాస్తాన్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. మంజూరైన పనుల్లో అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో వరంగల్ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో నిర్వహించే సమీక్షలో మైనారిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని వివిధ మైనారిటీ సంఘాలు కోరుతున్నాయి.

ముస్లిం సంఘాల డిమాండ్లు..

- ఉమ్మడి వరంగల్ జిల్లాకు మైనారిటీ స్టడీ సర్కిల్ మంజూరు చేయాలి.
- టెమ్రిస్ ఆధ్వర్యంలో బాలురు, బాలికలకు ఇంగ్లిష్ మీడియం డిగ్రీ గురుకులాలను ఏర్పాటు చేయాలి.
- ప్రత్యేకంగా మైనారిటీలకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- మహిళలు, యువతకు సబ్సిడీ రుణాలకు నిధులు కేటాయించాలి.
- మైనారిటీ సబ్‌ప్లాన్ అమలు చేయాలి.
- జిల్లాకు ఒక్క కమ్యూనిటీ సెంటర్లు ఏర్పాటు చేయాలి
- వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.
- ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాలు విడుదల చేయాలి.
- ప్రత్యేక ఉర్దూ డీఎస్సీని ప్రకటించాలి.

మైనారిటీ డిక్లరేషన్ అమలు చేయాలి



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన మైనారిటీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి. మైనారిటీల అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకోవాలి. వరంగల్ జిల్లాకు ప్రతేక నిధులు కేటాయించాలి. రెండో అతిపెద్ద నగరం వరంగల్ ముస్లిం స్లమ్ ఏరియాల్లో అభివృద్ధి చేయాలి. రెండో అధికార భాష ఉర్దూను పకడ్బందీగా అమలు చేయాలి.

- మహ్మద్ అబ్దుల్ సుభాన్, ఎంఐఎం అధ్యక్షుడు ఉమ్మడి వరంగల్ జిల్లా

రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

- రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి

హన్మకొండ అర్బన్ : రాష్ట్రంలోని రెడ్డిల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని, కానీ ఇప్పటి వరకు కార్పొరేషన్‌కు చైర్మన్‌ను ప్రకటించకపోవడం, నిధులు కేటాయించకపోవడం బాధాకరమని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని పోస్టల్‌కాలనీలోని సంఘం కార్యాలయంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభ్యుల అత్యవసర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం వివిధ మార్గాల్లో పోరాటాలు చేశామన్నారు. సీఎం వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు నిధుల కేటాయింపు పై స్పష్టత ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు రావుల నర్సింహారెడ్డి, నల్ల రాజిరెడ్డి, చాడా జైహింత్ రెడ్డి, గణపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

వ్యాసరచన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్: టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రస్తుత కాలంలో రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత' అంశం రాష్ట్ర స్థాయిలో న్యాయవాదులకు నిర్వహించనున్న వ్యాసరచన పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ తోట రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో టెన్‌కోర్ట్సు కాంప్లెక్స్ ఎదుట న్యాయవాదులతో కలిసి ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఆయన చిత్రపటానికి కోర్టు ఎదుట అమరవీరుల స్తూపం వద్ద క్షీరాభిషేకం చేశారు. టీపీసీసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జగన్మోహన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ భైరపాక జయాకర్, టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర స్పోక్స్‌పర్సన్ వేముల రమేశ్, నరసింహారావు, మహాత్మ, యాకస్వామి, భాస్కర్‌రెడ్డి, రాజారాంరెడ్డి, అనిల్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎఫ్ సదస్సును విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 28న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సదస్సును కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో నిర్వహించబోయే సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఎంఎస్‌ఎఫ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చి తీర్పును అమలు చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ తెలంగాణా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.తిరుపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిలెల్ల మురళిమాదిగ, ఎంఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు ముఖేష్, కేయూ ప్రధాన కార్యదర్శి అరిస్టాటిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

చెస్ విజేతలకు పతకాల అందజేత



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: కమల్‌కింగ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీల విజేతలకు సోమవారం పతకాలు, సర్టిఫికెట్లను అందజేశా రు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ న్యాయవాది కె.నర్సింహారావు విశిష్ట అతిథిలుగా సీహెచ్ రామకృష్ణ, మురళీలు హాజరై ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేశారు. అండర్-7,9,11,13,15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీలకు 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు టో ర్నమెంటు నిర్వహణ కార్యదర్శి రాంప్రసాద్ తెలి పారు. అకాడమీ ఎండీ షేక్ సలీం పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

కేయూ క్యాంపస్: ఫార్మసీ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని కేయూ ఫార్మసీ కళాశాల డీన్ ఆచార్యులు గాదె సమ్మయ్య అన్నారు. హనుమకొండలోని సహస్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా బీ-ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫార్మసీ కోర్సులు పూర్తి చేశాక వివిధ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఫార్మసీ యాక్ట్ 1940, రూల్స్ 1946, డ్రగ్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ 1948ని రక్షించుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ తిప్పాని ధీరజ్, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా డీన్ సమ్మయ్యను ఈ సందర్భంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయి అవార్డులు ఇవ్వాలి

నయీంనగర్ : నాటక కళాకారులకు (నంది అవార్డులాగా) కొత్త పేరు నిర్ణయించి తెలంగాణ రాష్ట్ర స్థాయి నాటక అవార్డులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర నాటక స మాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కళాభివందనాలు తెలిపారు. కాళోజీ కళాక్షేత్రం ముందు భాగంలో కాకతీయ కళాతోరణం ఏర్పాటు చేసి కళాక్షేత్రంలో కాకతీయుల ప్రతిమలను ఏర్పాటుచేయాలని కోరారు. తిరుమల్లయ్య, బాలాజీ, సదానందచారి, ప్రభాకర్ , సంజీవరెడ్డి, చక్రపాణి, రమేశ్, రవీందర్‌రావు, లక్ష్మణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మంజులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

హన్మకొండ చౌరస్తా: విద్యార్థులను ఇన్నోవేటివ్‌గా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచినందుకు హనుమకొండ గోపాలపూర్‌కు చెందిన సాగంటి మంజులను శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ పట్నం కమలమనోహర్, శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, ప్రముఖ రోబోటిక్స్ సంస్థ సీఈఓ మునీష్‌జిందాల్ చేతుల మీదుగా మంజులకు అవార్డును అందజేశారు. వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మంజుల తనకు అవార్డు రావడంపై సంతోషాన్ని వ్యక్తం చేసింది.



మంజులను సత్కరిస్తున్న సొసైటీ బాధ్యులు

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

మామునూరు : యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు మహమ్మద్ హైదర్‌గౌస్ అన్నారు. సోమవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో జిల్లా ఆత్మ సౌజన్యంతో మేకల పెంపకం, యాజమాన్యంపై యువ రైతులకు వృత్తినైపుణ్య శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై యువత ఆర్థికంగా ఎదగడానికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని, ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం యువ రైతులకు హైదర్‌గౌస్ శిక్షణ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ శాస్త్రవేత్తలు డాక్టర్ శశాంక్, సాయి కిరణ్, గణేష్, రాజు,యువ రైతులు పాల్గొన్నారు



యువ రైతులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు హైదర్‌గౌస్

సంక్షిప్త సమాచారం

హామీల అమలులో కేంద్రం విఫలం

న్యూశాయంపేట : విభజన హామీల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమైందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండ పార్టీ కార్యాలయంలో సహాయ కార్యదర్శి రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండో అతిపెద్ద నగరంగా విరాసిల్లుతున్న వరంగల్‌లో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఐ ఆవిర్భావ వేడుకల సందర్భంగా డిసెంబర్ 10 నుంచి 26 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన జెండా ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు.

నిత్యావసర సరుకులు అందజేత



మడికొండ: మడికొండలోని వినాయక నగర్‌లో రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన నార్లగిరి వనమాలకు సోమవారం మడికొండ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి తోచిన విధంగా సహాయ సహకారాలను అందించాలని సూచించారు.

అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలి

వరంగల్ అర్బన్ : నగరంలో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు వెంటనే చెల్లించాలని బల్దియా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కర్రు రమేష్, ఉపాధ్యక్షుడు సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శి సంపత్, శ్రీనివాస్, మాధవ్‌లు మాట్లాడారు. నగరానికి విచ్చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

శ్వేతార్కుడికి ప్రత్యేక అలంకరణ

కాజీపేట : కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో సోమవారం భక్తులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించగా పండితులు పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో పండితులు శ్వేతార్కుడితో పాటు ఉత్సవ విగ్రహాలు, ఆలయ ఆవరణలో కొలువుదీరిన 29 దేవతామూర్తులను నూతన వస్త్రాలు, గజమాలాలు, పూలతో అందంగా అలంకరించారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు మహాన్నదానం చేశారు.

సీఎం హామీని నిలబెట్టుకోవాలి

హన్మకొండ: వరంగల్ నగరాన్ని హైదరాబాద్ తరహాలో ఒక హెరిటేజ్ సిటీగా రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామనే హామీని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు విజ్ఞప్తి చేశారు. సీఎం వరంగల్ పర్యటన నేపథ్యంలో సోమవారం తిరునహరి శేషు లేఖ విడుదల చేసి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ వరంగల్ నగర అభివృద్ధికి ప్రతి బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని గుర్తు చేశారు. నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పాటు ప్రత్యేక అభివృద్ధి నిధులను కేటాయించాలన్నారు.

మెట్టుగుట్టపై కార్తీకమాస పూజలు

మడికొండ: 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం స్వామివారికి ప్రభాత సేవతో వైభవంగా గోపూజ, అఖండ దీపారాధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామలయంలో స్వామివారికి విశేష అర్చనలు జరిపించారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి తెలిపారు.

ఉసిరి చెట్టుకు..

ఖిలా వరంగల్: కార్తీక మాసం సోమవారం సందర్భంగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు జరిగాయి. వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లోని మంకీ కోర్టులో స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి ఆధ్వర్యంలో మారేడు, తులసి చెట్లకు దీపాలు వెలిగించి ఉసిరి చెట్టు కింద సామూహిక అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కేడల పద్మ హాజరై స్థానిక మహిళలతో కలిసి దీపాలు వెలిగించి తమ భక్తిభావాలను చాటారు.

గద్దర్ కూతురిని కలిసిన తొలితరం శిష్యులు

కాజీపేట రూరల్ : హైదరాబాద్‌లో ప్రజాగాయకుడు, యుద్ధనౌక గద్దర్ కూతురు గుమ్మడి వెన్నెలను గద్దర్ తొలితరం శిష్యులు, రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, కళాకారులు సాంబన్న, గోవర్దన్, నాగేంద్రబాబు వెన్నెలను సోమవారం కలిశారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ సేవలను గుర్తించి వెన్నెలను రాష్ట్ర సాంస్కృతిక సారథిగా నియమించింది. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని బొమ్మగుడిలో కాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయప్రధాన అర్చకులు కాపర్తి శంకర్ శర్మ, శివశర్మ, రాజేందర్ శర్మ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వగిలిశెట్టి అనిల్‌కుమార్ నేతృత్వంలో లక్ష బిల్వార్చన పూజను నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

హన్మకొండ అర్బన్ : నగరంలోని పద్మాక్షికాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షిదేవి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని సోమవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ, షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి ఆశీస్సులు పొందినట్లు పేర్కొన్నారు.

నిట్‌ను సందర్శించిన మోషన్ కాలేజీ విద్యార్థులు

హన్మకొండ: విద్యార్థుల్లో ఆలోచన శక్తి, పోటీతత్వాన్ని పెంపొందించుకునేందుకు మోషన్ కాలేజీ విద్యార్థులు సోమవారం దేశంలోనినే ప్రతిష్టాత్మకమైన వరంగల్ నిట్‌ను సందర్శించారు. కళాశాలను సందర్శించి ఇందులోని కోర్సుల వివరాలు, పరిశోధనలు, విద్యార్థులు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై విద్యార్థులు అధ్యయనం చేశారు. కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉంటుందని అన్నారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వం, ఆలోచనశక్తి పెంపొందించేందుకు వరంగల్ నిట్‌కి విద్యార్థులను తీసుకొచ్చామన్నారు. సురేష్, కోటా అధ్యాపకులు, పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శుల ఎన్నిక



అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అశోక్, వీరస్వామి

కాళోజీ సెంటర్ : టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా యు.అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఈదుల వీరస్వామిలను ఆదివారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నిక పరిశీలకులు ఎస్.కవిత, రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా ప్రగతి సభ కాదు.. మహిళలను దగా చేసిన వైఫల్య సభ

హన్మకొండ : హనుమకొండలో మంగళవారం నిర్వహించేది మహిళా ప్రగతి సభ కాదని...అది మహిళలను దగా చేసిన వైఫల్య సభ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, రైతుబంధు సమితి హనుమకొండ జిల్లా మాజీ కో ఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అమలుకాని మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను, మహిళలను, రైతులను, నిరుద్యోగులను వంచించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 11 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని దుయ్యబట్టారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్లావుల కుమార్ యాదవ్, హరికృష్ణ, రాజు, బండి రజనీకుమార్, జన్ను స్వామిదాస్, రామ్మూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇళ్ల కోసం ఐక్యపోరాటం

ఖిలావరంగల్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేంత వరకు సీపీఎం ఐక్యంగా పోరాటాలు చేయాలని పార్టీ మండల కార్యదర్శి నలిగంటి అనిల్ పిలుపునిచ్చారు. సోమవారం పడమరకోటలో ఎస్.రామకృష్ణ, గద్దల వసంత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చినా ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం చెందిందని ఆరోపించారు.

కళాక్షేత్రంపై ఉర్దూ బోర్డు ఏర్పాటు

న్యూశాయంపేట : సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రంపై రెండో అధికార భాషగా ఉన్న ఉర్దూలో లిఖించిన బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. కళాక్షేత్రంపై తెలుగు, ఇంగ్లిష్‌లో పెద్ద అక్షరాలతో నేమ్‌బోర్డును అధికారులు ఏర్పాటు చేయగా ఉర్దూ భాషా బోర్డును గ్రిల్స్‌పై చిన్న అక్షరాలతో బిగించారు. వరంగల్‌లోని ఉర్దూ భాషాభిమానులు, కవులు, కళాకారులు, రచయితలు వివిధ పార్టీల ముస్లిం సంఘాల నేతలు నిరసన తెలిపారు. జిల్లా కలెక్టర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలకు ఫిర్యాదులు చేశారు. ఎమ్మెల్యే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో సోమవారం ఆదే ఇనుప గ్రిల్స్‌కి పెద్ద అక్షరాలతో రేడియం స్టిక్కర్‌తో నేమ్ ప్లేట్‌ను బిగించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

హసన్‌పర్తి : రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన సుష్మిత, లక్ష్మణ్, ఇషాక్‌లు పాల్గొని బంగారు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం సుమదేవి తెలిపారు. ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని ఆమె తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. పీఈటీ పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.